
# మనసులోని బొమ్మ

## ఎస్. కాశీవిశ్వనాథం




ఆ రెండు కళ్ళూ ఎండలో పెట్టిన చేపపిల్లల్లా మెరిశాయి.

ఆ కళ్ళు పార్వతివి.

ఆమె అందంగా ఉంటుంది.

ఆమె చేతిలో ఉన్న చీర ఎంతో అందంగానూ, కొంచెం బరువుగానూ ఉంది.

ఆ చీరకు యజమానురాలు రమాదేవి.

ఆమెకు నాలుగు కళ్ళూ, నాలుగు లక్షల ఆస్తీ ఉన్నాయి.

ఆ చీరకు చిన్న చిరుగు పడింది.

అవును, పడింది.

పార్వతి టెయిలరు.

పార్వతి అందగత్తె.

పార్వతి తెలివయింది.

పార్వతి కింకా పెళ్ళి కాలేదు.

"ఈ చీర ఖరీదెంత?"— పార్వతి.

"అయిదు వందలు."— రమాదేవి.

"అమ్మో! అవన్నీ రూపాయిలే?"

"కాదు. పైసలు."

నవ్వులు, నవ్వులు. నాలుగు లక్షల రూపాయలు నవ్వుతున్న నాజూకయిన నవ్వులు.

"ఇది నా పెళ్ళిచీర. జాగ్రత్తగా కుట్టి రేపటిలోగా ఇచ్చెయ్యాలి." — రమాదేవి.

"ఇచ్చేస్తాను. ఇచ్చేస్తాను."

రమాదేవి వెళ్ళిపోయింది.

పార్వతి చీరని పరిశీలించి చూసింది. ఆ చీర పార్వతి పేదరికాన్ని చూసి ఖరీదయిన నవ్వొకటి నవ్వింది. రెండు పెంకు లూడిపోయిన ఆ ఇంటి పైకప్పు నించి ఎండ దూసుకొచ్చి ఆ చీరమీద పడింది. ఆ ఎండ మెరుపులో ఆ చీర బంగారపు రేకులాగ, ముత్యాల మూటలాగ, రత్నాల చాపలాగ, పగడాల పరదాలాగ కనిపించింది.

చీర ఖరీదు అయిదు వందలు.


అయిదు వందలు, అయిదు వందలు.

తన తండ్రి జీతాన్ని అయిదు పెట్టి గుణించినా ఆ సంఖ్య రాదు. తన జీవితాన్ని, ఆదాయాన్ని ఏ కోణంలో నించి చూసినా అయిదు వందల విలువ చెయ్యవు.

అందమయిన పార్వతి కుట్టడం మానేసి ఆలోచించ నారంభించింది.

ఆమెకు అందంతోపాటు ఆలోచనలు కూడా ఉన్నాయి. తన బ్రతుకును అన్ని కోణాలనించి చూడగలదు. చూసి ఏ కోణంలోనూ సుఖం లేదని కాగితం మీద వ్రాసి ఇచ్చెయ్యగలదు.

ఏ పనీ పాటా చేయకుండా, పేకాట మాత్రమే ఆడ్డానికి ఇష్టపడే మరో పని చేయాలంటే ఇష్టపడని తన పెద్ద తమ్ముడి బతుకు గురించి బాగా ఆలోచించగలదు. గవర్నమెంటు సర్వీసులో ఆఫీసర్ల కాలికింద చెప్పులాగ నలుగుతూ బండ్రోతుగా బతుకుతూ, పగలంతా పని గురించి, సాయంత్రమయితే సారా గురించి, సారా తాగిన తరవాత కూతురి పెళ్ళి గురించి ఆలోచించి కన్నీళ్ళు పెట్టుకునే తండ్రిని గురించి, బడికి వెళ్ళే ఇద్దరు తమ్ముళ్ళను గురించి, పోలియో వ్యాధితో కాలు పడిపోయిన చెల్లిని గురించి కూడా ఆలోచించగలదు. అంతేకాక, ముప్ఫై సమీపిస్తున్నా పెళ్ళికాని తన



కళావాహిని ఆధ్వర్యంలో గుంటూరు రిక్రియేషన్ క్లబ్ వారు మే 13 వ తేదీన మద్రాసులోని శ్రీ కృష్ణ గాన సభలో ప్రదర్శించిన 'బొబ్బిలి యుద్ధం' నాటకం లోని ఒక సన్నివేశం.

బ్రతుకు గురించి, వద్దన్నా పెరుగుతున్న వయసు గురించి, కావాలన్నా పెరగని తన ఆదాయం గురించి, అప్పుడప్పుడు ఆకాశం వెన్నెల చీర చుట్టుకున్నప్పుడు తన గుండెలో రగిలే గుబులును గురించి, తన అందం చూసి నోరు విప్పి, కట్నం ఇవ్వలేని తన కుటుంబ స్థితిని చూసి నోరు మూసుకుని వెనక్కి పారిపోయే పెళ్లికొడుకులను గురించి కూడా ఆలోచించగలదు. పార్వతికి అందమయిన చీరలు కట్టాలన్నా, అందమయిన మగ వాణ్ణి పెళ్లి చేసుకోవాలన్నా సరదా! కాని, ఈ రెండూ ఆమెకి తీరని కోరికలే అయ్యాయి.

మొదటి కోరిక తీరకపోవడానికి కారణం దరిద్రం. రెండో కోరిక తీరక పోవడానికి కారణమూ దరిద్రమే!

దరిద్రం, దరిద్రం.

అది జ్ఞాపకానికొచ్చినప్పుడల్లా తను నిప్పుల దుప్పటిని చుట్టుకున్నట్టుగాను, తన జీవన పుష్పం మురుగు కాలవలో పడిపోయినట్టుగాను, తను శ్మశానంలో పడుకున్నట్టుగాను బాధపడిపోతుంది. కాని, ఆ ఆలోచన రాకుండా ఉండదు. ఎప్పుడూ దాన్ని గురించే ఆలోచిస్తూంటుంది. అందుచేత ఆమె నిప్పుల దుప్పటి చుట్టుకుని, మురుగు కాలవలో నడుచుకుని, శ్మశానంలో పడుకుని బతకడానికే అలవాటు పడిపోయింది. పార్వతి ఎంత అందంగా ఉంటుందో, బట్టలుకూడా అంత అందంగానే కుడుతుంది. మగవాళ్ల బట్టలుకూడా కుట్టగలదు. కాని, కుట్టదు. అందమయిన ఆడది అడుక్కోవడానికి వెళ్లినా ఆమె పొత్తు కోసం శవాలు సైతం చేతులు చాపే ఈ సంఘంలో మగవాళ్ల బట్టలు ఆడది కుట్టాలంటే కొంత భయమే! అందుచేత కుట్టదు.

పార్వతి ధనవంతురాలు.

ఆమెకు రేడియో ఉంది.

స్వంత ఇల్లు, కారు ఉన్నాయి.

అంతేకాక వెయ్యిన్నర రూపాయల జీతంతో, అందంతో, ఆరోగ్యంతో భర్త ఉన్నాడు.

ఇవన్నీ పార్వతికి లభ్యమయ్యాయి— కలల్లో. ఆమెకు ఈ లోకంలో దేవుడిచ్చినవి రెండే రెండు.

ఒకటి— కలలు.

రెండు— కన్నీళ్లు.

ఆమె కళ్లకు అందమయిన కలలు కనే శక్తితోపాటు, అవసరమయినప్పుడు కన్నీళ్లు కార్చగల శక్తికూడా ఉంది. ఆమెకి జ్ఞాపకం ఉన్నప్పటి నించి కలలు కంటూంది. ఇకమీదటకూడా కనగలదు. తన ఇంటిలోని దరిద్రం అగ్నిమంటలాగ, తన యౌవనం, తన అందం అందులో పడి దూదిబొమ్మల్లా కాలిపోతున్నప్పుడు ఆమె కళ్లు చప్పుడు చెయ్యకుండా కన్నీరు కారుస్తాయి. ఆమె దగ్గర కన్నీరు ఇంకా నిలవ ఉంది.

ఎర్రంచు నల్లచీర గురించి ఆమె ఎన్నో సంవత్సరాలుగా కలలు కంటూంది. ఆమె కోర్కెకు వయసు ఇరవై

**కొన్ని కొన్ని పనులు అనుకోకుండా అడ్డం తిరుగుతాయి. అడ్డం తిరిగిన పని చూసి ఎదుటివాడు సానుభూతి పలికినా, ఏడవాలో, నవ్వాలో తనకే తెలియని సందిగ్ధావస్థ. అందమైన ఆడది అడుక్కోవడానికి వెళ్లినా, ఫోటో తీయించుకోవడానికి వెళినా శవాలు సైతం వెకిలిగా నవ్వే ఈ సమాజంలో ఏడ్పుకీ, నవ్వుకీ భేదం లేదేమో?**

దాటింది. కలలు కనీ కనీ ఆమె కళ్లు అలిసిపోయాయే తప్ప, ఆమె మనసుకు పిడికెడు తృప్తి కలగలేదు. ఖరీదయిన, మెత్తటి, అందమయిన ఎర్రంచు నల్ల చీర ఒక్కటంటే ఒక్కసారి కట్టుకోవాలని లక్ష సార్లు అనుకొంది.

కనీసం ఒక్కసారి ముట్టుకుంటే చాలునని వెయ్యి సార్లు అనుకునేది. అదే రంగు నేత ముతక చీరలు కట్టింది. అందువల్ల మనసు ఊరట చెందలేదు సరిగదా, మనసులోని అసంతృప్తి మరో జానెడు ఎదిగింది. రమాదేవి ఆ వీథంట అయిదు వందల రూపాయల ఎర్రంచు నల్లచీర కట్టుకుని పేరంటానికి వెళ్లుతూంటే పార్వతి కళ్లకి పేరంటమంతా కనిపించడం మానేసి, రమాదేవి కట్టుకున్న చీర ఆ వీథంతా, ఆ ఊరంతా, ఈ ప్రపంచమంతా పరుచుకున్నట్టుగా కనిపించేది. అంత ఇష్టమయిన చీరను తన ఇరవై ఎనిమిదేళ్ల వయసులో ఒక్కసారయినా ముట్టుకోవడం జరగలేదు. కాని, ఇప్పుడు జరిగింది.

ఆ చీరకి చిన్న చిరుగు పడింది. అంటే, ఆకాశంలాగ తన కందకుండా ఉన్న ఆ ఖరీదయిన చీరకు దేవుడే ఏదో రూపంలో వచ్చి చిరుగు పెట్టాడు. రమాదేవి చచ్చినట్టు ఆ చీరని తనకే ఇచ్చింది కుట్టమని.

తనకి పెళ్లి కాలేదు. ఇంక అవుతుందన్న ఆశా లేదు. అవుతుందన్న ఆశకు, అవగల అవకాశానికి మధ్య కట్నం పీట వేసుక్కూర్చుంది. ఆడది కేవలం అందంగా ఉండగానే పుస్తె మెడలో పడదు. ఇది పెద్ద సమస్య తనకి. ఇదిగాక ఇంకా చిల్లర బాధలు చాలా ఉన్నాయి. అవి చిరంజీవి సమస్యలు. వాటికి చావు ఉండదు. అవి మనిషిని వేధించి చంపుతాయే తప్ప, అవిమాత్రం చావవు. ఈ చీర తన కిప్పుడు పెద్ద సమస్య. ఇలాంటి చీర చస్తే తను కట్టలేదు. కట్టలేదుగాక కట్టలేదు. కాని, ఒక్కసారి కట్టాలి. ఆశలు ఉడిగిన తన జీవితంలో కొన్ని నిమిషాలయినా ఆనందంతో ఊపిరి పీల్చాలి. ఈ చీర కట్టుకుంటే రమాదేవిగారు కోప్పడతారా? పడతారు— పడరు— పడతారు — పడరు — పడతారు — పడరు. పడినా, పడకపోయినా తనకేం ఫర్వాలేదు. తన పీక తీసి కోటగుమ్మానికేసి కట్టేనాసరే, ఆ చీర కట్టెయ్యాలి. అయినా తను చీర కట్టుకున్నట్టు ఆమె చూడవస్తుందా ఏం? చీర కట్టుకుని తలుపులు గడియ వేసుకుని ఇంట్లో కాసేపు కూర్చుంటే సరి!

చీర కున్న చిరుగును గబగబ కుట్టేసింది. కాని, చాలా జాగ్రత్తగా కుట్టింది. గబగబ ఇంట్లో కెళ్లి తను కట్టుకున్న చీరను విప్పేసి ఖరీదయిన ఎర్రంచు నల్లచీరను గబగబ ఒంటికి చుట్టేసు

( తరువాయి 39 వ పేజీలో )

## మనసులోని...

(3[illegible] వ పేజీ తరువాయి)

కుంది. అద్దంలో చూసుకొంది. 'అమ్మో! ఎంత అందంగా ఉన్నాను!' అనుకొంది. వయసు మరో అయిదేళ్లు ముందుకు జరిగినట్లు కనిపించినా అందం మాత్రం మునుపటికంటె ఏభై రెట్లు ఎదిగినట్లు కనిపించింది. అద్దంలోని తన రూపాన్ని చిదిమి ముద్దు పెట్టుకొంది. తన ఎత్తు మరో నాలు గంగుళాలు ఎదిగినట్లు, తన బరువు ఓ పది పౌన్లు పెరిగినట్లు మాత్రమేకాక, తన నెలసరి ఆదాయం మరో అయిదు వందలు పెరిగినట్లుకూడా అనిపించింది. కాని, తను విప్పేసిన పాత చీర మసిగుడ్డలా, గోనెపాతలా, మేకతోలులా కనిపించింది. తరవాత రమాదేవి గుర్తు కొచ్చింది. 'ఏ, రుబ్బురాయిలాగ ఒళ్లూ అదీను. దానికేం బాగుంటుం దీ చీర? అడివిలోని రాయికి అందమయిన చీర కట్టినట్టుం టుంది. ఆస్తి ఉంటే మాత్రం ఆవిడకు అందం ఉండద్దూ? ఈ చీర తనకే బాగుంటుంది. అందం ఒక చోట, ఆస్తి మరో చోట ఇచ్చి దేవుడు ఆడవాళ్లమీద కసి తీర్చుకున్నాడు. హూఁ దేవుడుకూడా మగవాడే కదా! ఈ చీర కట్టుకుని అలా వీథిలోనికి వెళితే? అమ్మో, ఇంకేమన్నా ఉందా? వీథిలోని చుప్పనాతి శూర్పణఖ లందరూ గొంతు పిసుక్కుని చచ్చి పోరూ?. . .' ఆలోచనలు ఇలా వెండి దారాల్లాగ సాగుతున్నాయి. అయిదు నిమిషాలయినా గడవలేదు. బయటి నించి ఎవరో పిలిస్తే గబగబ చీర విప్పేసి, కింద పడి ఉన్న దిక్కుమాలిన నేత చీరనే, మేక తోలునే, గోనె పాతనే, మసిగుడ్డనే తీసి మళ్లీ కట్టుకుని బయటికి వచ్చింది.

ఆ రోజు రోజంతా పార్వతి మనసు మనసులో లేదు. మరెక్కడుంది? ఎర్రంచు నల్లచీరమీద ఉంది. చీర ముట్టు కుంటే చాలు సంతృప్తి పడగల ననుకున్న పార్వతికి అయిదు నిమిషాలపాటు ఆ చీరను కట్టుకున్నా తృప్తి కలగలేదు. మరో అయిదు నిమిషాలు. . . కాదు, పది నిమిషాలు, కాదు, కాదు, గంట— అదేం కాదు, ఆ చీర ఎప్పుడూ తన వద్దనే ఉండి పోవాలి. తనెప్పుడూ ఆ చీరనే కట్టు కోవాలి. ఆ ఊహ రాగానే పార్వతికి ముందు నవ్వు వచ్చింది. తరవాత ఏడుపు వచ్చింది. కాని, ఏడవకుండా ఆలోచించ నారంభించింది. కొండని కౌగిట్లో ఇముడ్చుకోలేదు. తన స్థితికి ఆ చీర కొండలాంటిదే! అంత ఖరీదయిన చీరను తన బ్రతుకు భరించలేదు. ఆ చీర కట్టుకున్న అయిదు నిమిషాలు తను భూమిమీద లేదు. స్వర్గంలో ఉంది. అద్దంలో కనపడిన తన బొమ్మ కెందు కంత అందం వచ్చింది? ఆ బొమ్మ తన మనసు కెంత తృప్తి నిచ్చింది! ఆ బొమ్మ స్థిరంగా ఉండాలి. ఆ అనుభూతి ఎప్పుడూ కలుగుతుండాలి.

కాని, ఎలా?

సాయంత్రం అయిదవుతుండగా పార్వతికి ఓ ఆలోచన తట్టింది. ఆలోచ నయితే బ్రహ్మాండంగా ఉంది. కాని. . . ఆలోచన అమలుజరగాలంటే ఆటలూ కాదు, మాటలూ కాదు. కాని, ఆ చీర కట్టించుకుని ఫోటో తీయించుకోవాలి. ఫోటోలో తనా చీరతో పెర్మనెంటుగా ఉండిపోతుంది. ఫోటో చూస్తున్న ప్రతి క్షణం తన మనసు మంచి గంధం పూసుకుంటుంది. అది చాలు తన బతుక్కి. కాని, అయిదు రూపాయలు రెడీగా లేవు— తన దగ్గిర బట్టలు కుట్టించుకున్న వాళ్లంతా ఫస్టు తారీఖు నాడు తప్ప, మరో రోజు డబ్బు లియ్యరు. ఎవర్నయినా అప్పడగాలి. ఎవర్నడగాలి? అప్పల్నర్సమ్మని అడిగితే ఇస్తుంది. కాని, వడ్డీ తీసుకుం టుంది. రూపాయికి అణాలు వడ్డీలు పిండుతుంది. డబ్బు గురించి ఆలోచిస్తూ కూర్చుంటే పొద్దుటే రమాదేవి వచ్చి చీర తీసుకుపోతుంది. మళ్లీ ఆ చీర తన దగ్గరికి రాదు. ఈ సారి ఏ ఎలకా వచ్చి చీరను కొరకనియ్యదు రమాదేవి. ఈ సారి తనే ఎలక గొంతును కొరికేస్తుంది. ఎలాగయినా అయిదు రూపాయలు సంపా దించి ఫోటో తీయించుకోవాలి. తన ఇంటి ఆదాయాన్ని ఇంటి ఖర్చుతో పోల్చి చూస్తే మదపుటేనుగు ముందు మేక పోతులా ఎందుకూ పనికిరాదు. తనకి లక్ష ఇబ్బందు లున్నాయి—అవి అలాగే ఉండగా అయిదు రూపాయలను ప్రాణం లేని ఫోటో కింద ఖర్చు పెట్టాలంటే కష్టమే! అయినా ఆమె లోని కోరిక ఆమె కష్టాలను జయించగలిగింది. అంతే! ఆలోచనల్ని కట్టిపెట్టి, కుట్టు మిషను ఎత్తిపెట్టి, సిల్కుచీరను సున్ని తంగా పొట్లం కట్టి, అప్పల్నర్సమ్మతో అర్జెంటుగా ఓ అబద్ధమాడి అయిదు రూపాయలు చేతబట్టి ఫోటో స్టూడియోలో కాలు పెట్టింది పార్వతి.

డ్రెస్సింగురూములో కెళ్లి చీర మార్చింది. ముఖం కడిగింది. పౌడరు రాసింది. తల దువ్వింది. అందమయిన పోజులో ఫోటో తీయించుకుని హాయిగా, తృప్తిగా నవ్వింది. "మేడమ్, మీరు కోపగించుకోనంటే ఓ మాట. మీ కీ చీర బ్రహ్మాండంగా మేచ్ అయింది. ఈ చీర ఎంతో బాగుంది. కాని, మీరు కట్టుకోవడం వల్ల ఆ చీరకే అంద మొచ్చింది" అంటూ కాకిలాగ నల్లగా ఉన్న ఫోటోగ్రాఫరు కామెంట్ పాస్ చేశాడు.

పార్వతి మెత్తగా నవ్వి ఊరుకుంది.

"ఈ అయిదు రూపాయలూ ఉంచు కుని రసీదివ్వండి. మొత్తం డబ్బు ముందే ఇచ్చేస్తున్నాను" అంది పార్వతి.

ఆ ఫోటోగ్రాఫరు పరమానంద భరితుడై, "చాలా థాంక్సండీ—మీలాంటి కస్టమర్సుంటే ఫోటో స్టూడియో వాళ్లం బాగుపడిపోతాం. నాల్రోజుల్లోగా మీ ఫోటో డెలివరీ ఇస్తాను" అన్నాడు.

పార్వతి మళ్లీ ఆ చీర విప్పేసి భద్రంగా పొట్లం కట్టి పాత చీరనే కట్టుకుని ఇంటి కొచ్చింది. పొద్దుటే రమాదేవి స్వయంగా వచ్చి ఆ చీర పట్టుకుపోయింది. తనకు దూరమయిన చీరను తలుచుకుంటూ ఒకటి, రెండు, మూడు రోజులు గడిపిన తరవాత నాలుగో రోజున పార్వతి ఫోటో స్టూడి యోకి పరుగెత్తింది.

ఆమెను చూడగానే కాకిలాంటి ఆ ఫోటోగ్రాఫరు మరింత నల్లబడిపోయి, మెల్లిగా, అతి మెల్లిగా— "మేడమ్, క్షమించాలి. నా పదిహేనేళ్ల సర్వీసులో ఒక్క ఫోటోకూడా ఫెయిలవలేదు. కాని, బుద్ధితక్కువ గాడిద మా అసిస్టెంటుకు రీలు కడగమని ఇస్తే రీలు రీలంతా తగలేశాడు. మొత్తం రీలంతా పాడయిపోయింది. కావాలంటే ఇదిగో చూడండి. ఒక్క బొమ్మకూడా పడలేదు. మీరు మరేమనుకోకుండా మళ్లీ ఆ చీర కట్టుకుని వస్తే బ్రహ్మాండంగా తీస్తాను. అస లిది ఎలా జరిగిందంటే . . ." అంటూ ఇంకా చెబుతూనే ఉన్నాడు.

పార్వతి పాడైపోయిన ఫిలిమ్‌ను చూసింది.

ఫిలిమ్‌మీద ఏ బొమ్మా పడలేదు. ఖాళీగా ఉంది.

"మళ్లీ ఆ చీర కట్టుకు వస్తే . . ." ఫోటోగ్రాఫరు.

'హూఁ ఇంక ఆ చీర బహుశా తన కలల్లోకికూడా రాదేమో?'

ఈ ఊహ రాగానే పార్వతి విచిత్రంగా, అందంగా, గమ్మత్తుగా నవ్వింది. ఆ నవ్వుకు అర్థం బొమ్మ పడని ఫిలిమ్‌కు, తృప్తిపడని ఆమె మనసుకే తెలుసు తప్ప, ఆమె కోర్కెకు ఫోటో తీయలేని ఫోటోగ్రాఫరుకు మాత్రం తెలియలేదు. *



నీలి మేఘాలలో

ఫొటో—భరద్వాజ (మద్రాసు)